క్లుప్తంగా

గణేష్ ఉత్సవాలకు ఏర్పాట్లు



ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

కాగజ్‌నగర్ టౌన్: గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు నియోజకవర్గంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 27 నుంచి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానుండడంతో తొమ్మిది రోజుల పాటు నిర్వహించేందుకు మండపలను సిద్ధం చేస్తున్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ద్వారకానగర్, ఇందిరా మార్కెట్, శ్రీకృష్ణనగర్ కాలనీ, శివాజీచౌక్, కాపువాడ, సర్‌సిల్క్ కాలనీలతో పాటు నియోజకవర్గంలోని కౌటాల, బెజ్జూరు, సిర్పూర్(టి), చింతలమానెపల్లి, బెజ్జూరు మండలాల్లో వినాయక మండపాలు భక్తులను ఆకట్టుకునే విధంగా ఏర్పాటు చేస్తున్నారు.

'పని ఒత్తిడి తగ్గించాలి'



మాట్లాడుతున్న ఆనంద్‌రావు

కెరమెరి: ఐకేపీ క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న సమైఖ్య సంఘం అసిస్టెంట్‌లపై పని ఒత్తిడి తగ్గించాలని సీఐటీయూ మండల కన్వీనర్ కూటికల ఆనంద్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వీరితో 67 రకాల పనులు చేయిస్తూ మానసికంగా వేధనలకు గురి చేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాల ప్రచారం, విద్యార్థుల యూనిఫామ్, ఉల్లాస్‌తో అదనంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వర్క్‌లను కూడా అప్పజెప్పడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. నాయకులు అనిసెట్టి రమేష్, మఘాడే రఘునాథ్ తదితరులు ఉన్నారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజలింగు

నార్నూర్: గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరపుకోవాలని తహసీల్దార్ జాడి రాజలింగు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎస్సై అఖిల్‌తో కలిసి గ్రామపెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. డీజేలకు అనుమతి లేదని, గణేశ్ మండపాలను పకడ్బందీగా నిర్వహించుకోవాలన్నారు. మండలపాల మందు తాగినా.. పేకాట ఆడిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బానోత్ గజానంద్‌నాయక్, కోల్కాటర్ పరమేశ్వర్, జాదవ్ రెడ్డి నాయక్, కైలాస్ నాయక్, బ్రిజులాల్, లోఖండే దేవురావు, తదితరులు ఉన్నారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి

నార్నూర్: సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయుల సంఘం మండల అధ్యక్షుడు రాథోడ్ కృష్ణారావు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జాడి రాజలింగుకు వినతిపత్రం అందజేశారు. 2014 ఆగస్టు 23న తెలంగాణ ఆవిర్భావం తర్వాత జీవో తీసుకొచ్చి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న జీవోను అమలు చేశారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ సీపీఎస్ విధానం రద్దు చేస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాథోడ్ రవీందర్, రాథోడ్ రమేశ్, విజయ్ పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం



సన్మానిస్తున్న దళిత సంఘాల నాయకులు

ఇంద్రవెల్లి: మండలంలోని భీంనగర్ కాలనీకి చెందిన పోటేపోడే సచిన్ ఇటీవల నేవీ మెడికల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించడంతో శనివారం అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సోన్‌కాంబ్లే జితేందర్, సభ్యులు సావంత్ రాజువర్ధన్, కాంబేల ఉత్తం, సందీప్, ఉత్తం పాల్గొన్నారు.

ఊరూరా 'పొలాల' సందడి



ఆసిఫాబాద్‌రూరల్: ఆలయం వద్ద ఎద్దులతో యువ రైతులు



కెరమెరి: బసవన్నలకు పూజలు చేస్తున్న మాజీ ఎంపీపీ మోతిరాం



దహెగాం: కర్జిలో ఆలయం వద్ద..



పెంచికల్‌పేట్: చేద్వాయిలో..

జిల్లా వ్యాప్తంగా పొలాల అమావాస్య పండుగను ఊరూరా శనివారం ఘనంగా జరుపుకున్నారు. రైతులు తమ వ్యవసాయ పనుల కోసం ఉపయోగించే ఎడ్లను అందంగా ముస్తాబు చేసి, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లోని ఆలయాల వద్దకు డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా తీసుకెళ్లి, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. అనంతరం కుటుంబసభ్యులు నైవేద్యాలను బసవన్నలకు తినిపించారు. పంటలు సంమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు. దీంతో గ్రామాల్లో పొలాల అమావాస్య సందడి నెలకొంది. సాక్షి, నెట్‌వర్క్



బసవన్నలను అలంకరించిన రైతు



కాగజ్‌నగర్ రూరల్: అందవెల్లిలో ఎడ్లతో ఊరేగింపు



చింతలమానెపల్లి: బాబాసాగర్‌లో బసవన్నల ఊరేగింపు



కెరమెరి: సంప్రదాయ రీతిలో మొక్కుతున్న ఆదివాసీలు



వాంకిడి: శివాలయం వద్ద పూజలు చేస్తున్న రైతులు

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప

బెజ్జూర్: మడలంలోని కుకుడ గ్రామానికి చెందిన ఆబిడ్ బీఆర్‌ఎస్ నాయకుడి తల్లి అనారోగ్యంతో చెందడంతో శనివారం సిర్పూర్(టి) మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్ టౌన్: ఆసిఫాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కోవలక్ష్మిని ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన సిర్పూర్ నియోజకవర్గ నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సిర్పూర్ నియోజకవర్గంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు కలిసి కట్టుగా కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే కోవలక్ష్మి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా కలిసి కట్టుగా పని చేయాలని, ప్రభుత్వం వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. కొంగ సత్యనారాయణ, లెండుగురె శ్యాంరావు, గొలెం వెంకటేశం, విశ్వనాథ్, నక్క మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన ప్లాస్టిక్ నిషేధం



వారసంత నిర్వహించే ప్రాంతంలోని చిక్లీ వాగు తీరంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

- పెరిగిన వినియోగం
- ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కుప్పలే..
- పట్టించుకోని అధికారులు

వాంకిడి: మండలంలో ప్లాస్టిక్ నిషేధంపై పట్టింపు కరువైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం విధించగా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పెరిగింది. మూడేళ్ల క్రితం మండల కేంద్రంతో పాటు ప్రధాన గ్రామ పంచాయతీలలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా అప్పటి నుంచి ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడం లేదు. ప్రస్తుతం వినియోగం పెరిగి ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయని, అధికారులు నివారణపై చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

అవగాహన లేక..

120 మైక్రాన్ల కంటే తక్కువ వ్యాసార్థం ఉన్న ప్లాస్టిక్‌ను మళ్లీ ప్రాసెస్ చేయడానికి వీలు పడదు. వాటి వల్ల కలిగే ప్రమాదాన్ని గుర్తించిన ప్రభుత్వాలు 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్‌ను నిషేధించింది. వీటిని వివరిస్తూ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. పట్టించుకోని వారిపై జరిమానాలు విధించాలి. కానీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు విన్పిస్తున్నాయి.

పెరిగిన వినియోగం..

మండలంలో ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పెరిగింది. రెండేళ్ల క్రితం పంచాయతీ అధికారులు ప్లాస్టిక్ నివారణపై అవగాహన కార్యక్రమాలతో పాటు, దుకాణదారులకు జరిమానాలు విధించడంతో కొంత వరకు అదుపులోకి వచ్చింది. ఆ తరువాత పట్టించుకునేవారు లేకపోవడంతో పరిస్థితి యథాస్థితికి చేరుకుంది. వాంకిడిలో కిరాణాలు, బేకరీలు, తదితర వ్యాపార సముదాయాలు, వైన్ షాపులలో, కూరగాయల మార్కెట్‌లో ప్లాస్టిక్ వాడకం అధికంగా కన్పిస్తుంది. దీంతో పర్యావరణానికి తీవ్ర స్థాయిలో అనర్థం వాటిల్లే ప్రమాదం ఉంది.

దృష్టి సారించాలి



మండలంలో ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పెరిగింది. భవిష్యత్తులో వాటిల్లే విపత్తులను దృష్టిలో పెట్టుకుని అధికారులు తగు చర్యలు తీసుకోవాలి. పకడ్బందీ నిబంధనలు అమలు చేసి దుకాణాలు, తదితర వ్యాపార సముదాయాలల్లో తనిఖీలు నిర్వహించాలి. ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలి. అధికారులు దృష్టి సారించాలి.

– జాడి మనోహర్, ఖమాన గ్రామం

అవగాహన కల్పిస్తున్నాం

ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వం నుంచి ఉన్న ఆదేశానుసారం చర్యలు తీసుకుంటున్నాం. గ్రామసభలు, సమావేశాలు నిర్వహించిన ప్రతీసారి ప్లాస్టిక్ నివారణ అంశంపై చర్చిస్తున్నాం. 120 కంటే తక్కువ మైక్రాన్లు గల ప్లాస్టిక్ కవర్లు కానీ, ఇతర వస్తువులు కానీ అమ్మకాలు, విక్రయాలు చేయరాదు.

– ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో

'గిరి' గ్రామాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

కెరమెరి: నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సీఐ సత్యనారాయణ, ఎస్సై మధూకర్ అన్నారు. శనివారం మండలంలోని అంబారావుగూడలో కార్యక్రమాన్ని నిర్వహించారు. తనిఖీలలో సరైన పత్రాలు లేని 24 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చిన్న రాజం ఇంటి పెరట్లో పెంచుతున్న గంజాయి మొక్కను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశారు. గ్రామంలో ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు తారసపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



గంజాయి మొక్కతో ఎస్సై, బాధితుడు

కాలువకు మరమ్మతులు చేపట్టాలి

ఆసిఫాబాద్‌రూరల్: వట్టివాగు ప్రధాన కుడి కాలువకు పడిన గండికి మరమ్మతులు చేపట్టాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి దినకర్ అన్నారు. శనివారం మండలంలోని కొమ్ముగూడ వద్ద కాలువకు పడిన గండిని రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు వట్టివాగు కాలువకు పడిన గండిని పూడ్చి రైతులకు సాగు నీరు విడుదల చేయాలన్నారు. సాగు చేస్తున్న వరి పొలాలు ఎండిపోక ముందు సంబంధిత అధికారులు మరమ్మతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. నాయకులు శ్రీనివాస్, కార్తిక్, టీకానంద్, మల్లేష్, సంతోష్, రాజన్న, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు



నైవేద్యంతో శివారుకు వెళ్తున్న ప్రజలు

ఘనంగా బడిగా!

కెరమెరి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు శనివారం బడిగా పండుగను ఘనంగా జరుపుకున్నారు. పొలాల అమావాస్య తర్వాత జరిపే పండుగను బడిగా అంటారు. బసవన్నలకు తినిపించే నైవేద్యంతో గ్రామ శివారులోని జమ్మిచెట్టుకు పూజలు జరిపారు. యువకులు, చిన్నారులు తమ మొర్కోళ్లను చెట్టు వద్ద పడేశారు. అనంతరం మర్రి చెట్టు, తెల్లమద్ది, తదితర చెట్లకు సంబంధించిన మొక్కలను ఇళ్లకు తీసుకెళ్లారు. వాటిని ఇంట్లో దాచిపెట్టి కొద్ది రోజుల తర్వాత పిల్లలకు జ్వరం, ఇతర రోగాలు వస్తే వాటితో పెట్టిన పొగతో నయమవుతాయని వారి నమ్మకం.



శివారు చెట్టుకు పూజలు చేస్తున్న ప్రజలు

భవానీ జాతర ఏర్పాట్లు పరిశీలన

వాంకిడి: మండలంలోని సరాండి గ్రామ సమీపంలో గల భవానీ గుట్ట వద్ద నిర్వహించే జాతర ఏర్పాట్లను ఎస్సై మహేందర్ శనివారం స్థానికులతో కలిసి పరిశీలించారు. ఏటా పొలాల అమావాస్య మరుసటి రోజున బడగ రోజున గుట్ట వద్ద జాతర నిర్వహిస్తుంటారు. మహారాష్ట్రతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివస్తుంటారు. దీంతో భక్తులు ఇబ్బందులు పడకుండా పోలీసులు తగు చర్యలు తీసుకుంటున్నారు. వర్షాలతో బురదమయంగా మారిన రోడ్డుపై మొరం మట్టి పోయించి మరమ్మతులు చేపట్టారు. ఆయన వెంట గ్రామస్తులు ఉన్నారు.



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న ఎస్సై మహేందర్

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న ఎస్సై

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన విద్యార్థి నవదీప్ గురువారం పాముకాటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఎస్సై అనిల్‌కుమార్ స్పందించి విద్యార్థి కుటుంబానికి శనివారం రూ. 5 వేల నగదు అందజేశారు. ఆర్థిక సాయం అందజేయడంతో మృతుని కుటుంబసభ్యులు ఎస్సైకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాస్, శ్రీకాంత్, సురేశ్, సమ్మక్క పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

బెజ్జూర్: నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మానాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో బండారి ప్రవీన్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని రెబ్బెన గ్రామంలో పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా చేయాలని, ఈనెల 31లోపు పనులు ప్రారంభించాలని సూచించారు. బేస్‌మెంట్‌లోపు పనులు పూర్తి చేస్తే మొదటి విడతగా లక్ష రూపాయల బిల్లులు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి గౌరీ శంకర్, కార్యదర్శులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

సొసైటీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

కాగజ్‌నగర్ టౌన్: కొత్తపల్లి వెంకటలక్ష్మి- చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ స్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, అనితలు అన్నారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ ఆసుపత్రిలో ఉచిత కంటి పరీక్షల్లో ఎంపిక చేసిన 13 మందిని బెల్లంపల్లి లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సొసైటీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిచ్చిమొక్కల తొలగింపు

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు శనివారం తొలగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ తూడురు దత్తాత్రేయ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పిచ్చి మొక్కలు తొలగిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు